# మన దేవుడు

# బయలుపరచుకొనువాడు

ఒక ప్రాముఖ్యమైన భావంలో, దేవుడు దాగియుండలేదు. ఆయన ఉనికియే బయలు పరచబడుటగా ప్రతిఫలిస్తుంది. స్వభావమునుబట్టి ఆయన కలుగజేయువాడు గనుక, సృష్టియే సృష్టికర్తను బయలుపరచుతోంది. సృజింపబడినవారంగా మన సొంత ఉనికియే ఆయన సృష్టికి రుజువుగా ఉంది.

కొన్ని సంవత్సరాల క్రిందట వేటికన్‌లోని సిస్‌టైన్ చాపల్లో నిలిచి పైకప్పుమీద బహు వింతైన చిత్రాలు పెయింట్ చేయబడిన దృశ్యాలు చూచే అవకాశం లభించింది. నేను నిజంగా ఆశ్చర్యంతో నిలిచియుండగా, ఏ వ్యక్తియైనా యింత అద్భుతంగా ఎలా చేయగలిగాడా అని ఆశ్చర్యపోయాను గాని, ఎవరైనా ఒకరు చేశారా అని మాత్రం నేను ఆశ్చర్యపోలేదు! ఆ అందమైన చిత్రాలను ఎవరో ఒకడు చిత్రించాడనడానికి రుజువుగా ఉంది! ఆలాటి ఆశ్చర్యకరమైన ప్రదర్శనలో సహితం ఆ (ఆర్టిస్ట్) కళాకారుని శీలాన్ని కూడా చూచాను. ఆ పని ముగించడానికి బహు దీర్ఘకాలం పట్టియుంటుందని నేను గ్రహించాను. (నాలుగున్నర సంవత్సరాలంత) గొప్ప ఓర్పు కావలసి వచ్చింది. అసాధారణ మైన నేర్పు ప్రదర్శించబడింది. దృష్టియొక్క ఆకర్షణ, మోతాదులను గూర్చిన మహనీయమైన తెలివిని ఆ పని కనుపరచింది. భౌతికమైన సహన శక్తి అవసరమని స్పష్టంగా కన్పించింది. క్లుప్తంగా చెప్పాలంటే, ఆ కళకు కళాకారుడు కావాలి అనేది మాత్రమే గాక; బహు నేర్పరియైన కళాకారుడు అవసరమని అతని పూర్ణ సామర్థ్యాన్ని తెలిపే ఆ ఉత్తమ చిత్రం తన తీర్మానాన్ని తెలిపింది.

సృష్టి యొక్క పరిస్థితి కూడా అదే. అది ఎవరో ఒకరి యొక్క బహు గంభీరమైన సాధారణ ప్రత్యక్షతయైయుంది. సృష్టియొక్క సాధారణ ప్రత్యక్షతలో, కేవలం సృష్టికర్త యొక్క ఉనికియనే వాస్తవం కంటే, మనం ఎంతో ఎక్కువ గ్రహించగలం. సృష్టికర్త యొక్క "శీలమును" సహా మనం కొంతమట్టుకు చూడగలం. ఉదాహరణకు, దేవునియందు భక్తిపూర్వకమైన విశ్వాసంగల దావీదుచే (ఈ అబ్జర్వేషన్) గుర్తింపబడింది: "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచు చున్నది" (కీర్తన. 19:1). దేవుని చేతి పనిలో దావీదు దేవుని మహిమను చూచాడు. నేడు, విశ్వంయొక్క అపరిమిత్వాన్ని బట్టిన్నీ, మన సూర్యకుటుంబం (సోలార్ సిస్టం యొక్క ఫంక్షన్) హెచ్చు తగ్గులు లేకుండ పని చేయడాన్నిబట్టి మనం ఆశ్చర్యపోతాం. వాస్తవంగా, మనం మన వాచీలను, కాలిక్యులేటర్స్‌ను చూచుకునేటప్పుడు హెచ్చుతగ్గులు లేకుండ పనిచేసే సూర్య కుటుంబం మీద ఆధారపడతాం. పగలు రాత్రులు, ఋతువులు

వచ్చిపోవడం వాటి క్రమం మీదనే జరుగుతుంటుంది. గ్రహణములు ఏర్పడేలా సూర్యుని గ్రహాలు ఎలా తిరిగి వచ్చేది, ఎక్కడ గ్రహణం భూమిమీద జరిగేదాన్ని గూర్చి ఖగోళ శాస్త్రజ్ఞులు ముందుగా చెప్పగలుగుతున్నారు. [గ్రహాలు క్రమబద్ధంగా వాటివాటి స్థానాల్లో హెచ్చుతగ్గులు లేకుండ తిరగడాన్ని బట్టియేగదా వారు చెప్పగలుగుతుంది.] అవును, ఆయన సృష్టిని పరిశీలించడంవలన సృష్టికర్తయొక్క మహిమ, గొప్పతనం, మరియు క్రమం మనం తెలిసికోగలుగుతున్నాం.

మరొక ప్రాముఖ్యమైన భావంలో, దేవుడు దాగియున్నాడు. సృష్టికర్తయొక్క వాస్తవికతను సృష్టియందు చూస్తున్నాం. మరియు అందులో సృష్టికర్తయొక్క "కొన్ని" గుణలక్షణాలను చూస్తాం. ఏదియెలాగున్నా, సిస్టైన్ చాపల్లోని చిత్ర లేఖనాలను ఎవరు చిత్రించారో స్వయంగా అది తెలుపలేనట్టే సృష్టికర్త ఎవరు అన్న సంగతి సృష్టియే మనకు తెలుపదు. మైకలేంజిలో దానిని పెయింట్ చేశాడని తెలిసికొన్నాను, నేను ఆ చిత్ర లేఖనాలను చూచినప్పుడు కాదు సుమీ, ఇటలీ దేశపు చిత్రకళయొక్క గొప్ప పునరుద్ధరణ కాలాన్ని గూర్చి నేను చదివి పరిశీలన చేసినప్పుడు ఈ విషయం నేను నేర్చుకున్నాను. అదే విధంగా, ఈ మహా విశ్వాన్ని, ఈ లోకాన్ని ఎవరు సృజించారో అనేదాన్ని బైబిలుల్లో దేవుని ప్రత్యేకమైన ప్రత్యక్షతను చదివి పరిశీలించినప్పుడు మనం కనుగొనగలం. ఆ మహా గంభీరమైన శిల్పకారుడు ఆయనయేనని మనం కనుగొంటాం. లేఖనాల [ప్రత్యేకమైన బయల్పాటు] సహాయం లేకుండ అసలు సృష్టికర్త ఎవరైనది నేనుగాని నీవుగాని తెలిసికోలేం.

అందువలననే, దేవుని గూర్చిన మన చర్చలో బైబిలును మనం జాగ్రత్తగా ఉపయోగిస్తున్నాం. సృష్టికర్తను గూర్చియు, సృష్టికర్తకున్న కొన్ని గుణలక్షణాలను గూర్చియు స్థాపించడానికిగాను (ప్రకృతి) సాధారణమైన ప్రత్యక్షత సహాయపడుతుందని కనుగొన్నాం, కాని సృష్టికర్త బైబిలు దేవుడని గుర్తుపట్టడానికి మనం లేఖనముల వైపు తిరిగాం. తన ప్రజల యొక్క చరిత్రలో ఆయన జరిగించిన మహా గొప్ప కార్యాలు ఆయనను గూర్చి బయలుపరచినట్టు మనం ముందుగా చదివాం. ఏదియెలాగున్నా, చరిత్రలో ఆయన జోక్యం పుచ్చుకొనడంలో ఆయన సన్మార్గ స్వభావం ప్రాముఖ్యమయ్యింది. బయలుపడిన ఈ మహా గొప్ప సత్యము బైబిలునుండియేగాని, అక్కడక్కడ సంభవించిన కార్యాలవలన మాత్రం కాదు. అందువలన మనకు మరుగైయున్న మరియు బయలుపరచబడిన దేవుడున్నాడు. ప్రకృతి (సృష్టి) యందును, బైబిలునందును బయలుపరచబడేవరకు ఆయన మరుగుగా ఉన్నాడు. మరియు బయలుపరచుకొన్నది కూడా ఆయన యిష్టపడిన మేరకు మాత్రమే.

## తన సమాచారాన్ని పంపడంలో బయలుపరచుకొన్నాడు

వ్యక్తిగతమైన విధానంలో దేవుడు తన్ను తాను బయలుపరచుకొన్నట్టు బైబిలు చూపుతుంది. అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, మోషే, సమూయేలు, నాతాను, యెహెజ్కేలు మొదలైనవారితో ఆయన మాట్లాడాడు.[1] ఇలా మాట్లాడింది తన చిత్తాన్ని తెలియజేయడానికే. తన ప్రజలు సరిగా నడిపింపబడాలని ఆయన కోరాడు. చారిత్రక

వాస్తవాలకంటే యిందులో ఎక్కువ యిమిడియున్నాయ్. వారి మధ్య ఆయన కార్యములకు హేతువు మరియు ఆయన (ప్రత్యక్షత) ప్రకటనలో వారితో ఆయనకున్న సంబంధం ప్రధాన పాత్ర వహించింది. గనుక, ఆయన కార్యాలు ఆయన మాటలు ఏకంగా కలిసి వారికి ప్రసాదించే కాపుదల, భద్రత, నడిపింపు, సమాధానపరచుకొనడం అనేవి దేవుని చిత్రిస్తాయి. ఆ సందర్భంలోనుండి ఆయన చిత్తం బయలుపరచబడింది.

## తన నిబంధనయందు బయలుపరచుకొన్నాడు

నిబంధన, దాని విభాగాలన్నిటితోపాటు, వారికొరకైన దేవుని అక్కర కేంద్ర భాగమై ఉంది. (స్టడీయింగ్ నేచర్) పరిశోధనా తత్వం, చరిత్ర విభాగములను పరీక్షించుట, లేదా సమకాలిక లా కోడ్స్‌లోనుండి భాగాలను అరువు తెచ్చుకొనడం, అనేవాటిద్వారా ఆ నిబంధన వివేచింపబడలేదు.[2] "పది మాటలతో" ఆరంభించి సీనాయిమీద మోషేకు దేవునిచే నేరుగా యివ్వబడింది.[3]

## ఆయన కార్యాలలోను మాటలలోను బయలుపరచుకొన్నాడు

యుగములలోను తరములలోను తన ప్రజలకు దేవుడు తన్ను తాను బయలు పరచుకునే విధానాన్ని కొనసాగించాడు. ఆయన కార్యములు తన శక్తియందు ఆయనను బయలుపరచాయి. ఆ కార్యాలకు ఆయన మాటలు ఉద్దేశాన్ని కనుపరచినవై వారికి బయలుపరచబడ్డాయి.[4] వచ్చే తరాలు వాటివలన మేలు పొందునట్టుగా అవి వ్రాయ బడ్డాయి.[5] అధిగమించకుండను, తక్కువకాకుండను వ్రాయబడిన దానిని శ్రద్ధగా పాటించాలని జనులు హెచ్చరింపబడ్డారు.[6]

తన ప్రజలతో ఆయనకున్న బాంధవ్యంలో బయలుపరచబడిన దేవుని కార్యాలు, మాటలు అవసరమైన మిశ్రిత పదార్థాలుగా ఉండిపోయాయ్. ఆయన కార్యాలు జరిగించకుండ ఉండియున్నట్టయితే, వారు ఆయన శక్తిని ఎరుగగలిగేవారు కారు. ఆయన మాట్లాడక యుండియున్నట్లయితే, వారు ఆయన చిత్తాన్ని ఎరిగియుండ గలిగేవారు కారు. "రక్షణ చరిత్ర" వ్రాయబడక పోయినట్లయితే, వారు జ్ఞాపకం ఉంచుకోగలిగేవారు కారు. వారు జ్ఞాపకముంచుకొనకపోతే, ఆయననుండి వేరైపోయేవారే. వారి గొప్ప నాయకులలో ఒకడు యిలా అనడంలో ఆశ్చర్యపడనక్కరలేదు,

> యెహోవా నా శైలము, నా కోట, నా రక్షకుడు. నా దుర్గము, నేను ఆయనను ఆశ్రయించుదును. నా కేడెము నా రక్షణశృంగము నా ఉన్నతదుర్గము, నా ఆశ్రయ స్థానము. ఆయనే నా రక్షకుడు బలత్కారులనుండి నన్ను రక్షించువాడవు నీవే (2 సమూ. 22:2, 3).

## ప్రవక్తలయందు బయలుపరచుకొన్నాడు

దేవుని సంపూర్ణమైన అతిగొప్ప ప్రత్యక్షత యింకను రావలసియున్నది. ఆయన చిత్తము ఆయన ఏర్పాట్లు బయలుపరచుకొనడానికి దేవుని ప్రవక్తలు ప్రధానమైన మార్గాలైయున్నారు. సీనాయి నిబంధన క్రింద జీవిస్తున్నప్పుడు, రానైయున్న క్రొత్త నిబంధనను గూర్చి వారు పలికారు. ఆ నిబంధన – దాని ఆరంభము, దాని స్వభావము, మరియు దానిని పొందేవారికి దానివలన కలిగే ఫలితాలు అనేవాటిని యిర్మీయా వర్ణించాడు:

> ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను క్రొత్తనిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు. అది ఐగుప్తులోనుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యి పట్టుకొనిన దినమున, వారి పితరులతో నేను చేసిన నిబంధనవంటిది కాదు; నేను వారి పెనిమిటినైనను వారు ఆ నిబంధనను భంగము చేసికొనిరి; ఇదే యెహోవా వాక్కు. ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను చేయబోవు నిబంధన యిదే, వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయముమీద దాని వ్రాసెదను; యెహోవా వాక్కు ఇదే. నేను వారికి దేవుడనైయుందును వారు నాకు జనులగుదురు; వారు మరి ఎన్నడును – యెహోవానుగూర్చి బోధనొందుదము అని తమ పొరుగువారికిగాని తమ సహోదరులకుగాని ఉపదేశము చేయరు; నేను వారి దోషములను క్షమించి వారి పాపములను ఇక నెన్నడును జ్ఞాపకము చేసికొనను గనుక అల్పులేమి ఘనులేమి అందరును నన్నెరుగుదురు; ఇదే యెహోవా వాక్కు (యిర్మీయా 31:31–34).

ఒకే ఒకరు తప్ప – దేవుని ప్రవక్తల మధ్య మోషేతో పోలినవాడెవడునులేడు (ద్వితీయో. 34:10–12). రాబోయే ప్రవక్త తనవంటివాడైయుంటాడని మోషే తెలిపాడు. అతడు దేవుని మాటలనే పలుకుతాడు గనుక ఆ ప్రవక్త మాటలను స్పష్టంగా లక్ష్యపెట్టాలి. (ద్వితీయో. 18:15–19).

## తన కుమారునియందు బయలుపరచుకున్నాడు

ఈ ప్రవక్త తరువాత శ్రమ అనుభవించు మెస్సీయా, ప్రభువైన యేసు (అపొ. 3:17–26), చంపివేయబడు నీతిపరుడుగా గురుతు చూపబడ్డాడు (అపొ. 7:52, 53). ఆయన సిలువ వేయబడక మునుపు, పస్కా భోజనం చేయడానికి అపొస్తలులతో కూడాడు. ఆ భోజన సమయాన, ఆ రొట్టెకును పాత్రకును క్రొత్త భావాన్ని యిచ్చాడు: “మీరు తీసికొని తినుడి; ఇది నా శరీరమని ఆ రొట్టెనుగూర్చి చెప్పాడు.” పాత్రనుగూర్చి, “ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుతున్న (క్రొత్త) నిబంధన రక్తము” (మత్తయి 26:26–28; మార్కు 14:22–24; లూకా 12:19, 20). ఆయన బలిద్వారా, క్రొత్త శ్రేష్ఠమైన నిబంధనకు మధ్యవర్తియయ్యాడు. మొదటి దానిని ఆయన పాతదిగా చేశాడు, అదే సమయంలో పాత నిబంధనలో నమ్మకంగా జీవించినవారికి ఆయన విమోచనా విధానాన్ని ప్రసాదించాడు (హెబ్రీ. 8–10).

ఈ నజరేయుడగు యేసు దేవుని అత్యున్నతమైన బయల్పాటైయున్నాడు. “దేవుడు మనకు తోడు” అని అర్థమిచ్చునట్టి “ఇమ్మానుయేలు” అని ప్రవక్తయైన యెషయా ద్వారా పలుకబడినవాడు ఈయనయే అయినట్టు గుర్తింపబడ్డాడు (యెషయా 7:14; మత్తయి 1:20–23). ఇందువల్ల, దేవునికి తన ప్రజలతోనున్న బయల్పాటుతో కూడిన సంబంధం ఆయన కుమారుడైన యేసునందు గరిష్ఠ శిఖరానికి చేరుకుంది.

> దేవుని కృపామహ దైశ్వర్యమును బట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది. కాలము సంపూర్ణమైనప్పుడు జరుగవలసిన యేర్పాటునుబట్టి, ఆయన తన దయా సంకల్పము చొప్పున తన చిత్తమును గూర్చిన మర్మము మనకు తెలియజేసి, మనకు సంపూర్ణమైన జ్ఞాన వివేచన కలుగుటకు ఆ కృపను మన యెడల విస్తరింపజేసెను (ఎఫెసీ. 1:7–9).

సూచనలు

[1]ఆది. 13:14; 26:2; 28:13; నిర్గమ. 6:2, 8; 1 సమూ. 3:10; 2 సమూ. 7:4; యెహెజ్కేలు 3:22. [2]James B. Pritchard, ed., “The Middle Assyrian Laws,” in *Ancient Near Eastern Texts Relating to the Old Testament*, 2d ed., trans. F. G. and Theophile J. Meeke (Princeton, N. J.: Princeton University, 1955), 180-88. [3]హెబ్రీ ప్రయోగం I.e., *sereth haddbarim* అంటే, “ఆ పది మాటలు” అని అర్థం. గ్రీకు (LXX), *hoi deka logoi*, అంటే “ఆ పది మాటలు” లేక “పది ఆజ్ఞలు” అని అర్థం. [4]Arnold B. Rhodes, *The Mighty Acts of God* (Richmond, Va.: CLC Press, 1964), 12-13. [5]ద్వితీయో. 31:24; యెహోషువ 1:8; నెహెమ్యా 8:13, 14; యెషయా 30:8; యిర్మీయా 30:1, 2; వగైరాలు. [6]ద్వితీయో. 4:1, 2; సామెతలు 30:5, 6; మార్కు 11:17; ప్రకటన 22:18, 19.